ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
మంగళవారం 21 జనవరి 2025



న్యూస్ బాక్స్

మాదిగల మహాప్రదర్శనను విజయవంతం చేయాలి


సిరిసిల్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మాదిగల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని బీసీ కవులు, కళాకారులు, మేధావుల ఐక్యవేదిక కన్వీనర్ దరువు అంజన్న, మోహన్ బైరాగి కోరారు. సోమవారం సిరిసిల్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమం నడుస్తోందన్నారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేయడం సమంజసమని చెప్పినా కమిషన్ ఎస్సీ వర్గీకరణ జరగాలని పేర్కొన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా ప్రకటించడం లేదని అన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రజాస్వామిక హక్కు అని దానిని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు గుండా థామస్, కానాపురం లక్ష్మణ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కత్తెర దేవదాస్, సుధాకర్, కౌన్సిలర్ సత్యనారాయణ, వెంకట్రాములు, బాలయ్య, పర్శరాములు, సాయి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నాగంపేట మీదుగా బస్సు నడపాలి

గంభీరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నుంచి గంభీరావుపేట మీదుగా వెళ్లే రామాయంపేట బస్సు సర్వీస్‌ను నాగంపేట మీదుగా నడపాలని సిరిసిల్ల డిపో మేనేజర్‌కు పలువురు సోమవారం వినతిపత్రం అందజేశారు. గతంలో రామాయంపేట బస్సు సర్వీస్ నాగంపేట మీదుగా వెళ్లేదని, కొన్ని కారణాలతో ఆ బస్సును ఈరూట్లో రద్దు చేశారని పేర్కొన్నారు. దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, రామాయంపేట బస్సు సర్వీస్‌ను తిరిగి నాగంపేట మీదుగా నడపాలని డిపో మేనేజర్ ప్రకాష్‌రావును కోరారు. మాజీ ఎంపీటీసీ మేరుగు నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు యెల్ల బాలకృష్ణ, గణేష్, దేవరాజు ఉన్నారు.

'సంక్షేమం' అందరికీ అందేనా..?

- నేటి నుంచి 24 వరకు గ్రామసభలు
- నిరంతర ప్రక్రియగా ప్రచారం
- ఇందిరమ్మ ఇళ్ల సర్వే 98.20 శాతం పూర్తి
- జిల్లాలో గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకాల క్షేత్రస్థాయి పరిశీలన ముగిసింది. సంక్షేమపథకాల అర్హుల జాబితాలను పరిశీలించిన అధికారులు మంగళవారం నుంచి 24వతేదీ వరకు గ్రామాలు, మున్సిపాలిటీలోని వార్డుల్లో సభలు నిర్వహించి లబ్ధిదారులను ప్రకటించనున్నారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన తరహాలోనే గ్రామసభలు, మున్సిపల్ వార్డుసభలు నిర్వహించాలని వచ్చిన ఆదేశాల మేరకు జిల్లాలో సభలకు హాజరయ్యే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించడానికి ఏర్పాట్లు చేశారు. గ్రామ సభల నిర్వహణకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

● అర్హులైన వారికి రేషన్ కార్డులు

ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాల అమలులో శ్రీకారం చుట్టారు. అందులో ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్నా రేషన్‌కార్డుల జారీ అర్హుల్లో ఆశలు పెంచింది. గత సంవత్సరం ప్రజాపాలన దరఖాస్తుల సమయంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో రేషన్‌కార్డుల కోసం 40 వేల దరఖాస్తులు వచ్చాయి. చేర్పులు, మార్పులకు సంబంధించి 20,606 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులు మాత్రం ప్రస్తుతం రేషన్ కార్డుల అర్హుల జాబితాను 9,731 కుటుంబాలుగా గుర్తించి సర్వే చేశారు. పాత దరఖాస్తులను పరిగణలోకి తీసుకోకుండా కులగణన సర్వే ఆధారంగా తయారు చేయడంతో..

మిగతా 8లో

ఇందిరమ్మ ఇళ్లు సర్వే చేసినవి..

మండలం	దరఖాస్తులు
బోయినపల్లి	6,937
చందుర్తి	6,376
ఇల్లంతకుంట	10,208
గంభీరావుపేట	8,400
కోనరావుపేట	7,948
ముస్తాబాద్	9,447
రుద్రంగి	3,772
వేములవాడ రూరల్	4,758
ఎల్లారెడ్డిపేట	9,484
తంగళ్లపల్లి	9,176
వీర్నపల్లి	3,668
వేములవాడ	4,914
సిరిసిల్ల మున్సిపాలిటీ	11,926
వేములవాడ మున్సిపాలిటీ	8,452
మొత్తం	1,05,466

రేషన్‌కార్డుల కోసం ప్రభుత్వం గుర్తించిన కుటుంబాలు

మండలం	కుటుంబాలు
బోయినపల్లి	553
చందుర్తి	655
ఇల్లంతకుంట	903
గంభీరావుపేట	717
కోనరావుపేట	836
ముస్తాబాద్	903
రుద్రంగి	314
సిరిసిల్ల	1420
తంగళ్లపల్లి	710
వీర్నపల్లి	217
వేములవాడ అర్బన్	819
వేములవాడ	421
వేములవాడ రూరల్	496
ఎల్లారెడ్డిపేట	767
మొత్తం	9731

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కూలీలు

మండలం	కూలీల సంఖ్య
బోయినపల్లిలో	857
చందుర్తిలో	666
ఇల్లంతకుంటలో	1,150
గంభీరావుపేటలో	1,247
కోనరావుపేటలో	1,155
ముస్తాబాద్‌లో	1,088
రుద్రంగిలో	323
తంగళ్లపల్లిలో	1,676
వీర్నపల్లిలో	795
వేములవాడలో	293
వేములవాడ రూరల్‌లో	687
ఎల్లారెడ్డిపేటలో	1,548
మొత్తం	11,485

గణతంత్ర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. సోమవారం జనవరి 26న నిర్వహించే గణతంత్ర వేడుకలపై అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయం అవరణలోని పెరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. అన్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు కూర్చోవడానికి ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లను సిరిసిల్ల ఆర్డీవో, తహసీల్దార్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కూడిన స్టాళ్ల ప్రదర్శనను ఏర్పాటు చేయాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో సేవలు అందిస్తున్న వారికి ప్రశంసాపత్రాలను ప్రదానం చేయడానికి ఇప్పటి వరకు ప్రశంసా పత్రాలు అందుకోని వారిని ఎంపిక చేసి 24లోగా ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, డీపీఆర్వో శ్రీధర్, కమీషనర్ లావణ్య, డీఈవో జగన్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఉమారాణి, ఏవో రామిరెడ్డి, జౌళి శాఖ ఏడీ సాగర్, ఎఆర్, ఆర్ఐలు మధుకర్, రమేష్ పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

- సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్



స్టిక్కర్లు అంటిస్తున్న రాధికా జైస్వాల్

సిరిసిల్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వాహనాదారులు నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్ సూచించారు. సోమవారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో వాహనాలకు స్టిక్కర్లు అంటించడం, నిబంధనలపై అవగాహన కల్పించే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్నావారికి స్వీట్లు అందించారు. ధరించని వారికి గులాబీపూలు అందించారు. ఈ సందర్భంగా జైస్వాల్ మాట్లాడుతూ వాహనాలు అతివేగంగా నడపద్దని సీట్‌బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి వి లక్ష్మణ్, ఎంవీఐ వంశీధర్, అసిస్టెంట్ ఎంవీఐ రజనిదేవి, పృథ్వీరాజ్ వర్మ, కానిస్టేబుల్ రమ్య, హోంగార్డు ఎల్లయ్య, కల్పన, శ్రావణి, ట్రాక్టర్‌అసోసియేషన్ అధ్యక్షుడు పాటి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ దర్శకుడు వేణు

సిరిసిల్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల కేంద్రంగా ఫిబ్రవరి 16న జరిగే రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల పోస్టర్‌ను సినిమా దర్శకుడు, నటుడు వెల్దండి వేణు ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో శ్రీవేంకటేశ్వర క్రియేషన్స్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. సిరిసిల్లలోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వొద్నాల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, ప్రవల్లిక, మానస తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాల నిర్మూలనలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- విద్యార్థులకు అవగాహన సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

8

భక్తజన సంద్రం... రాజన్న క్షేత్రం

- ఆలయానికి పోటెత్తిన భక్తులు
- దర్శనానికి నాలుగు గంటల సమయం

7



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి చర్యలు

- 4.24 కోట్ల మీటర్ల వస్త్రోత్పత్తి ఆర్డర్లు
- ఇందిరా మహిళ శక్తి చీరల ఉత్పత్తి
- టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు

సిరిసిల్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో స్వశక్తి సంఘాలకు అందించే చీరల ఆర్డర్లను 129 మ్యాక్స్ సొసైటీలకు అందించే ఆర్డర్ కాపీని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా మహిళ శక్తి చీరల పథకంలో మొదటి విడతలో 4.24 కోట్ల మీటర్ల ఆర్డర్లను అందజేశామని వెల్లడించారు. ఈ చీరలను ఏప్రిల్ 30వ తేదీలోగా సిద్ధం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వేములవాడ కేంద్రంగా రూ. 50 కోట్లతో యారన్ బ్యాంక్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మార్కెట్‌లో పోటీపడి స్వయం సమృద్ధి సాధించాలని ప్రభుత్వ, ప్రైవేటు ఆర్డర్లు తయారు చేసేలా యంత్రాలను ఆధునీకరించుకోవాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన రూ. 500 కోట్ల బకాయిలు విడుదల చేసిందని అన్నారు. ఆధునిక, నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసేలా సిద్ధం కావాలన్నారు. ఇప్పటికే 65.67 లక్షల స్కూల్ యూనిఫాం ఆర్డర్లు ఇచ్చామని తెలిపారు. ఆర్డర్లు అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వస్త్ర పారిశ్రామికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్, టెస్కో ఏడీ సందీప్‌జోషి పాల్గొన్నారు.



చీరల ఆర్డర్ల కాపీని అందిస్తున్న టెస్కో జీఎం అశోక్‌రావు

● సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి భరోసా

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న నేత కుటుంబాలకు మళ్లీ ఇందిరా మహిళ శక్తి చీరలు భరోసాను ఇవ్వనున్నాయి. 129 మ్యాక్స్ సొసైటీలకు టెస్కో ఆర్డర్లు అందించడంతో నేత కార్మికుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. రాష్ట్రంలోని స్వశక్తి సంఘాల్లోని సభ్యులకు రెండేసి చీరలు ఇవ్వడం ద్వారా నేత కార్మికులకు భరోసా కల్పించడానికి పూనుకుంది. ఇందిరా మహిళ శక్తి చీరల పథకంలో స్వశక్తి సంఘాలకు అందించే చీరల ఆర్డర్లు రావడంతో మళ్లీ సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు జవసత్వాలు వచ్చినట్లేనని భావిస్తున్నారు. సిరిసిల్లలో 30,352 మరమగ్గాలు ఉండగా 200 వరకు వార్పిన్, సైజింగ్, డైయింగ్ యూనిట్లు వున్నాయి. వీటిపై ప్రత్యక్షంగా పరోక్షంగా 20 వేల కార్మిక కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి చీరల ఆర్డర్లతో నిత్యం ఉపాధి దొరుకుతుందని కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో స్వశక్తి పొదుపు సంఘాల్లో 63 లక్షల మంది మహిళలు ఉన్నారు. వీరికి రెండు చీరల చొప్పున 1.30 కోట్ల చీరలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో పాటు చీరల డిజైన్లను కూడా పరిశీలించి ఆమోదం తెలిపారు. కోటి 30 లక్షల చీరలకు రూ. 650 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు వేశారు. ఇందులో భాగంగా చీరల ఉత్పత్తిని సిరిసిల్ల మరమ గ్గాలపైనే చేపట్టే దిశగా మ్యాక్స్ సొసైటీలకు మొదటి విడతలో ఇందిర మహిళ శక్తి చీరల్లో ఒకే రంగులో యూనిఫాంకు సంబంధించి 4.24 కోట్ల మీటర్ల చీరల ఆర్డర్లను సిరిసిల్లలోని 129 మ్యాక్స్ సొసైటీలకు అందించారు. మొదటి దశలో రూ. 325 కోట్లతో 65 లక్షల చీరలు ఉత్పత్తి చేయనున్నారు. ఇందులో 9 మీటర్లు (గోచీ) చీరలు, ఇతర మహిళలు ఉపయోగించే బ్లౌజ్‌తో కలిపి 6.30 మీటర్ల చీరలకు సంబంధించిన ఆర్డర్లను సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు ఇచ్చారు. స్వశక్తి సంఘాల మహిళలకు అందించే చీరలను ఏప్రిల్ 30వ తేది వరకు ఉత్పత్తి పూర్తి చేసి అందించనున్నారు. స్వశక్తి సంఘాలకు అందించే చీరలను జరీ అంచులతో గ్రే క్లాత్ తయారు చేసి ఒకే రకం ప్రింటింగ్ చేయనున్నారు.

రైతుల సంక్షేమానికి పాటుపడాలి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, పాల్గొన్న పాలకవర్గ సభ్యులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి పాటుపడతామని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సబేరాబేగం మాట్లాడుతూ అన్నదాతల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. రైతుల సౌలభ్యం కోసం గుండారంలో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయడానికి గోదాం నిర్మాణానికి స్థలం సేకరించడంతో పాటు గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాల ఏర్పాటుకు సభ్యులు తీర్మాణించారు. సమావేశంలో వైస్ చైర్మన్ రాంరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, గణపతి, లక్ష్మారెడ్డి, నారాయణరెడ్డి, బాలయ్య, రవీందర్, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాజేందర్, చిన్నలక్ష్మి, మార్కెటు కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లంతకుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి పేర్కొన్నారు. మండలంలోని తిప్పాపూర్‌లో సోమవారం మీకోసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు యువకులు వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలను పాడుచేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్, వీపీవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీకి పరామర్శ

తంగళ్లపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్యను మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ సోమవారం పరామర్శించారు. ఇటీవల ప్రభుత్వ భూమి ఆక్రమ పట్టా పొందారని కోడి అంతయ్య, బండి దేవదాస్, కోడూరి భాస్కర్ గౌడ్, సురభి నవీన్ రావు లపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారు. బెయిల్‌పై విడుదలైన వారిని తంగళ్లపల్లి మండల కేంద్రంలోని కోడి అంతయ్య నివాసంలో కలిసి పరామర్శించారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు ఉన్నారు.

దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- ప్రజావాణికి భారీగా దరఖాస్తులు

సిరిసిల్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజలు నుంచి వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను సోమవారం ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి ప్రజావాణి దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తుదారుల సమస్యలు వింటూ అధికారులకు సూచనలు, చేసి పరిష్కరించాలనే ఆదేశాలు ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, రుణమాఫీ సమస్యలు, ఉపాధి కోసం దరఖాస్తులతో పెద్దసంఖ్యలో ప్రజావాణికి తరలివచ్చారు. ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించి గ్రామసభలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జాబితాలో పేర్లు లేనివారు దరఖాస్తులతో ప్రజావాణికి తరలివచ్చారు. 222 మంది వివిధ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు.

అందులో రెవెన్యూకు సంబంధించి 89 దరఖాస్తులు, ఎస్‌డీసీకి 6, వివిధ మండల పరిషత్‌లకు 16, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలకు 20 దరఖాస్తులు వచ్చాయి. చేనేత జౌళి శాఖ, మైనింగ్, ఎస్సీ అభివృద్ధి శాఖ, సెస్, మిషన్‌భగీరథ, మత్స్యశాఖ, ప్రొహిబిషన్, సహకార శాఖలకు సంబంధించి ఒక్కొక్క దరఖాస్తు వచ్చింది. విద్యాశాఖకు 3, పోలీస్ శాఖకు 12, ఎస్సీ కార్పొరేషన్‌కు ఐదు, సంక్షేమ శాఖకు 15, ఆరోగ్య శాఖ ఐదు, వ్యవసాయ శాఖకు ఏడు, పౌరసరఫరాలకు మూడు దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులు తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు.





దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, క్యూలైన్ వస్తున్న దరఖాస్తుదారులు

పరిహారం ఇప్పించండి..

- వేముల నాగమ్మ



వేములవాడకు చెందిన నాగమ్మ తన భూమి రైల్వే లైన్‌లో పోయిందని పరిహారం మాత్రం అందలేదని అవేదన చెందింది. తనకు వచ్చిన పరిహారం వేరేవారి ఖాతాలోకి వెళ్లిందని పరిహారం ఇప్పించాలని వేడుకుంది.

ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలి..

- చాందిని కౌర్



చాలా ఏళ్ల క్రితమే సిరిసిల్లకు వలసవచ్చి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసుకోని జీవిస్తున్నామని చాందిని కౌర్ ఆవేదన చెందారు. స్థలం యజమానులు ఖాళీ చేయించిన ప్రతీసారి వేరేచోటికి వెళుతూ కాలం వెల్లదీస్తున్నామని తమకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నాని తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి


లింగన్న(ఫైల్)

ఇబ్రహీంపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన పిట్లం లింగన్న (41) అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు. లింగన్న ఈ నెల 14న ఇంట్లో నుంచి వెళ్లి మరునాడు వ్యవసాయ తోటలో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. లింగన్న తల్లిదండ్రులకు అనారోగ్య సమస్యలతో చికిత్సకు, పంట సాగుకు అప్పు చేయాల్సి వచ్చిందన్నారు. అప్పు తీర్చలేక మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. భార్య పిట్ల లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య


ఆశన్న(ఫైల్)

ఇబ్రహీంపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోధూర్ గ్రామానికి చెందిన రెబ్బసి ఆశన్న(72) అనే వృద్ధుడు సోమవారం పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపారు. ఆశన్న భార్య రెబ్బసి శాంత మూడు నెలల క్రితం మరణించగా తట్టుకోలేక సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి మంచంపై పడిపోయాడు. కుటుంబ సభ్యులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కొడుకు రెబ్బసి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నాట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బాలిక ఆత్మహత్య

జగిత్యాల క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో సోమవారం ఓ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పట్టణంలోని గంజ్ ప్రాంతానికి చెందిన పదమూడు సంవత్సరాల బాలిక స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. రెండు రోజుల క్రితం తల్లిదండ్రులతో గొడవ పడి ఇంటి నుంచి పారిపోగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి హైదరాబాద్‌లో పట్టుకుని ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సోమవారం కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో బాలిక ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన పాత అరుణ్‌కుమార్ అనే వ్యాపారి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. పదిహేను రోజుల క్రితం అక్రమంగా 1.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఎవరైన పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసినా అక్రమంగా తరలించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) అదృశ్యమైంది. సోమవారం బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై కిరణ్ కుమార్‌గౌడ్ తెలిపారు. బాలిక మెట్‌పల్లిలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. సంక్రాంతి సెలవుల కారణంగా ఇంటి వద్దే ఉంది. ఈ నెల 15న తల్లికి తెలపకుండా ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన రాసం రాకేష్ ప్రేమపేరుతో వేధించేవాడని, అతడిపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అత్యవసర సమయాల్లో అండగా..



- విపత్తులను ఎదుర్కొనేందుకు 'ఆపద మిత్ర'ల నియామకం
- జిల్లాలో 300 మంది వలంటీర్ల ఎంపిక
- స్థానిక ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులకు అవకాశం
- మొదటి దశలో 59 మందికి 12 రోజుల శిక్షణ

కరీంనగర్ క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తులు సంభవిం చినప్పుడు సరైన సమయంలో సహాయం అందక తీవ్ర నష్టం జరుగుతోంది. సమాచారం అందుకుని ప్రభుత్వ యంత్రాంగం అక్కడికి చేరుకునే ఆలస్యమవుతోంది. ఇలాంటి నష్టాలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ పథకాన్ని ప్రారంభించింది. గ్రామాల్లో, పట్టణాల్లో పనిచేసే ప్రభుత్వ రంగ ఉద్యోగులతో పాటు స్వచ్ఛం దంగా ముందుకు వచ్చే వారికి 'ఆపద మిత్ర' కింద విపత్తులు ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై శిక్షణ ఇస్తు న్నారు. ఇందులో భాగంగా అగ్నిమాపకశాఖ, పోలీసు శాఖ, పంచాయతీరాజ్ శాఖ, వైద్య శాఖ, పశుసంవర్ధక శాఖలకు చెందిన జిల్లా అధికారులు వలంటీర్లకు పలు అంశాలపై అవగాహన కల్పి స్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, పాము కాటు, కుక్కకాటు, అగ్ని ప్రమాదం, విద్యుదాఘాతం, వరదలు, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణను ఇచ్చారు. ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఆపద మిత్ర శిక్షణ తీసుకున్న వలంటీర్లు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటారు.

● స్థానికులకు ప్రాధాన్యం

ఆపదమిత్రలుగా శిక్షణ తీసుకున్న వారు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అక్కడికి చేరకుంటారు. నష్టం జరగకుండా.. బాధితులకు అండగా ఉంటారు. వరదలో చిక్కుకున్న వారు ఉంటే వారిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటారు. అవసరమైన ప్రభుత్వ శాఖలకు ఎప్పటి కప్పుడు సమాచారం అందజేస్తారు. మొదటి దశలో జిల్లాలోని 59 మంది వలంటీర్లకు ఆపదమిత్ర కింద శిక్షణ ఇచ్చారు. స్థానికులకే ఈ శిక్షణ ఇచ్చారు. శిక్షణకు హాజరైన వారు నేర్చుకున్న నైపుణ్యాలను, మెళకువలను మరో పదిమందికి నేర్పించాలని అధికారులు సూచిం చారు. అగ్నిప్రమాదాలు జరిగిన సమయాల్లో ఆస్తులు రక్షించడం, మనుషులు, జంతువుల ప్రాణాలను కాపా డడం, వరదల్లో కొట్టుకు పోతున్న వ్యక్తిని రక్షించడం వంటి అంశాల్లో శిక్షణ దిగువ మానేరు జలాశయంలో శిక్షణ ఇచ్చారు. తిమ్మాపూర్ మండలం నల్గొండలో నాలుగు ఫైరింజన్‌లతో ఫీల్డ్ ట్రైనింగ్ అందించారు. కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఆపదమిత్ర కోర్స్ కోఆర్డినేటర్ అయిన జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ఎం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 12 రోజులపాటు ఈ శిక్షణ కొనసాగింది.

● ప్రత్యేక రక్షణ కిట్లు....

మొదటి దశలో శిక్షణ పొందిన 59 మంది ఆపద మిత్రలకు త్వరలోనే ప్రత్యేక రక్షణ కిట్లను అందజేయనున్నారు. ఈ కిట్లలో స్పెషల్ గాగుల్స్, ఫైర్‌ప్రూఫ్ హెల్మెట్, లైవ్‌జాకెట్స్, షూ, రోప్, ఇతర రక్షణకు సంబంధించిన పరికరాలు, వస్తువులుంటాయి. ఈ రక్షణ కిట్లను త్వరలోనే శిక్షణ పూర్తి చేసుకున్న ఆపదమిత్రలకు అందించనున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే విపత్తుల నుంచి ప్రజలను రక్షించేందుకు కేంద్రప్రభుత్వ పథకంలో భాగంగా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆపదమిత్రలకు శిక్షణ అందిస్తున్నామని కోఆర్డినేటర్, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

శునకాల స్వైర విహారం

ఓదెల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. గూడెంలో రెండు రోజుల క్రితం రియాన్ష అనే చిన్నారిపై దాడి చేయడంతో మొఖంపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చిన్నారి తల్లిదండ్రులు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటన మూడు రోజుల క్రితం జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓదెల పొత్కపల్లి, మడకలో రెండు రోజుల క్రితం దాడులకు పాల్పడ్డాయి. సోమవారం నాటు వేయడానికి వెళుతున్న కూలీలపై కుక్కలు కరవడంతో గాయాలకు గురై సుల్తానాబాద్, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోనరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం బావుసాయిపేట అనుబంధ గ్రామమైన రామన్నపల్లికి చెందిన బత్తుల మల్లయ్య (28) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వస్తూ అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. మల్లయ్య ఇంటి పనులపై బయటకు వెళ్లి ఇంటికి ఆదివారం రాత్రి తిరిగి వస్తున్నాడు. గ్రామ శివారులోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి కింద పడిపోగా తలకు గాయాలై మృతి చెందాడు. మృతుడు మల్లయ్య భార్య రేణవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోద చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ


తెరిచి ఉన్న బీరువా

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. మూడు రోజుల క్రితం ఊరెళ్లిన ఇంటి యజమాని సోమవారం రాత్రి తిరిగి రావడంతో దొంగతనం వెలుగు చూసింది. గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న వంగల శ్రీనివాస్ భాగ్య దంపతులు మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని కుమారుడి వద్దకు వెళ్లారు. సోమవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో సుల్తానాబాద్ వచ్చారు. ఇంటి తాళం తీసి ఉండడంతో డయల్ 100కు సమాచారం ఇచ్చారు. దొంగలు తాళం ఊడదీసి లోపలికి చొరబడి బీరువాలను తెరిచి సామాన్లను కింద పడేశారు. హాల్‌లోని టీవీని ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఏ మేరకు చోరీ జరిగిందనేది తెలియాల్సి ఉంది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


టీఎన్‌జీవో డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, యూనియన్ నాయకులు

సుభాష్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం స్థానిక టీఎన్‌జీవో ఫంక్షన్ హాలులో టీఎన్‌జీవో ఆధ్వర్యంలో రూపొందించిన 2025 డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధానకార్యదర్శి ముజీబ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, ప్రధానకార్యదర్శి సంగెం లక్ష్మణ రావు, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, కట్కూరి నాగుల నరసింహ స్వామి, శ్రీకాంత్, రాగి శ్రీనివాస్, హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి సుమంత్‌రావు, రూరల్ అధ్యక్షుడు వాస్తవిక్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, కార్యదర్శి నాగరాజు, రామస్వామి, శంకర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, కార్యదర్శి సత్యనారాయణ, జగిత్యాల అధ్యక్షుడు నాగేందర్, కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, కామ సతీష్, గిరిదర్‌రావు, శంకర్, మహిళ నాయకురాళ్లు శారద, సునీత, హరిప్రియ, లత, సరిత, పెన్షనర్ల సంఘం నాయకులు కేశవరెడ్డి, గాజుల నర్సయ్య, ఎల దాసరి లింగయ్య, రమేశ్, గోవిందపతి శ్రీనివాస్, పత్తేంశ్రీనివాస్, కరుణాకర్ పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న చిరుత సంచారం

● గేదెపై దాడి ● భయాందోళనలో ప్రజలు


ముస్తాఫానగర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనాదేవి

గంభీరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్ గ్రామ సమీప వ్యవసాయ పొలాల్లో చిరుత సంచారం కలకలం రేపుతోంది. ముస్తాఫనగర్‌కు చెందిన రాసమల్ల రాజు అనే రైతుకు చెందిన గేదెపై దాడిచేసి చంపేసింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనదేవి, డిప్యూటీ రేంజ్ అధికారి అంజలి, బీట్ అధికారి రమేష్ సంఘటన స్థలానికి చేరుకుని చిరుతగా అధికారులు నిర్ధారించారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ పొలాల వద్దకు రాత్రి వేళల్లో రైతు లు వెళ్లొద్దని, కొట్టాల్లో పశువులను ఉంచరాదని రేంజ్ అధికారి కల్పనదేవి సూచించారు.

● మండలంలో వరుస ఘటనలు

గంభీరావుపేట మండలంలో చిరుత సంచరిస్తూ వరుస దాడులకు పాల్పడుతోంది. మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామ సమీప వ్యవసాయ పొలాల వద్ద ఉన్న గేదెలపై అప్పట్లో చిరుత దాడి చేసి హతమార్చింది. ముచ్చర్ల ప్రాంతంలో రెండు మూడుసార్లు చిరుత దాడులకు తెగబడింది. అదే క్రమంలో గోరంటాల సమీప అడవుల్లో కూడా మేకల మందపై చిరుత దాడి చేసిన సందర్భాలు ఉన్నాయి. మల్లుపల్లె బ్రిడ్జి వద్ద ఇటీవల చిరుత అడవి పంది పిల్లలపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. గతంలో దమ్మన్నపేట సమీప అడవుల్లో చిరుత సంచరించింది. పలు గ్రామాల్లో చిరుత సంచారం అధికమవుతుండటంతో గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఒకే చిరుత ఇన్ని గ్రామాల్లోని వ్యవసాయ పొలాల్లో సంచరిస్తుందా లేక చిరుతల సంఖ్య పెరిగిందా అనే విషయం తెలియాల్సి ఉంది.

లొట్టి పోయి.. బాటిల్ వచ్చె..


తాటి చెట్టుకు కట్టిన ప్లాస్టిక్ బాటిల్స్

కోనరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అంతా ప్లాస్టిక్ మయం అయిపోయింది. ప్లాస్టిక్ భూతం కల్లు కుండలకు కూడా తాకింది. కుమ్మరి కులస్తులు చేసిన కుండలను కల్లుకోసం తాటి చెట్లకు కడుతుంటారు. మట్టి కుండల తయారీ తక్కువ కావడం, మరో వైపు వాటి ధరలకు కూడా పెరిగిపోవడంతో గౌడ కులస్తులు కొన్ని చోట్ల తాటి చెట్టుకు కుండలకు బదులుగా ప్లాస్టిక్ బాటిల్స్ కడుతున్నారు. సుద్దాల గ్రామ శివారులో తాటిచెట్టుకు కట్టిన వాటర్ బాటిల్స్‌ను ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. మార్కెట్‌లో కుండలు లభించక ప్లాస్టిక్ బాటిల్స్ కట్టినట్లు గౌడ కులస్థులు పేర్కొంటున్నారు. వీటిని చెట్లకు కట్టడం సులభంగా ఉందన్నారు.

అగ్ని ప్రమాదంలో రూ.55 వేల ఆస్తి నష్టం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కరీంనగర్ క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో సోమవారం వేకువజామున జరిగిన రెండు అగ్నిప్రమాదాల సంఘటనల్లో రూ.55 వేల విలువైన ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు. కరీంనగర్ శివారులోని తీగలవంతెన సమీపంలోని సోహెల్ హోటల్(దాబా)లో ఉదయం 4:30 గంటలకు మంటలు అంటుకోవడంతో వెంటనే స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది ఫైరింజన్ వాహనంతో వెళ్లి మంటలను ఆర్పివేశారు. హోటల్‌లో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని రిఫ్రిజిరేటర్, వంట నూనె, ఇతన ఆహార ముడి పదార్థాలు దగ్ధమయ్యాయని, వాటి విలువ సుమారు 50 వేల వరకు ఉంటుందని హోటల్ యజమాని ఆసిఫ్‌ఖాన్ ఫిర్యాదు చేశాడని అధికారులు తెలిపారు. మంచిర్యాల చౌరస్తాలోని వీఆర్‌ఆర్ నగర్‌లో ఇంటి పక్క ఖాళీ స్థలంలో కర్రలకు మంటలు అంటుకొని దగ్ధమమయ్యాయి. ఫైరి సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సుమారు 5 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు.

దాడికి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో దాడికి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన బందుకు శ్రీనివాస్, అతని కుమారుడు నరేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని గడ్డం ఆనందం అనే వ్యక్తికి చెందిన వ్యవసాయ భూమి విషయంలో గొడవ జరిగిందని పేర్కొన్నారు. ఈ నెల 19న ఆనందం భార్య పుష్పలత, కొడుకు కరుణాకర్, జగన్‌లు తమ వ్యవసాయ పొలానికి చేరుకోగా శ్రీనివాస్, నరేశ్‌లు అడ్డుకోవడంతో పాటు కర్ర, గడ్డపార, కొడవలితో దాడి చేసి గాయాపరిచారని చెప్పారు. బాధితుడు ఆనందం ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ఒకరి రిమాండ్

శంకరపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో చిట్టి డబ్బుల విషయంలో జరిగిన గొడవలో ఓ వ్యక్తి కోమాలోకి పోవడానికి కారణమైన వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొలంగూర్ గ్రామానికి చెందిన కొలిపాక సమ్మయ్య అదే గ్రామానికి చెందిన కల్లూరు శ్రీనివాస్ అనే వ్యక్తుల మధ్య చిట్టి డబ్బుల విషయంలో గతంలో గొడవ జరిగింది. ఈ గొడవలో బైక్ పైన ఉన్న సమ్మయ్యను శ్రీనివాస్ కిందకి తోసి తలపై కొట్టడంతో బలమైన గాయమైంది. దీంతో సమ్మయ్య కోమాలోకి పోయా డని అతని భార్య కొలిపాక నిర్మల కల్లూరు శ్రీనివాస్‌పై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి సోమవారం శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

వివాహితను వేధిస్తున్న యువకుడి అరెస్టు

ఇల్లంతకుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను లైంగికంగా వేధిస్తున్న యువకుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. ఎస్సై వివరాల ప్రకారం బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన కతెరపాక దిలీప్ అనే యువకుడు తరచూ వివాహితను వెంబండించడంతో పాటు లైంగిక వేధింపులకు గురిచేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామానికి చెందిన తుమ్మ ప్రసాద్ (40) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తుమ్మ ప్రసాద్ ద్విచక్ర వాహనంపై శనివారం కనుకుల నుంచి సుల్తానాబాద్ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ప్రసాద్ సోమవారం మృతి చెందారు. మృతుడికి కొడుకు కూతురు ఉన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

- పెరిగిన వాహనాల రాకపోకలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు


తుమ్మనపల్లి గ్రామంలో ఇరుకుగా ఉండి.. సైడ్ వాల్స్ దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న వంతెన

హుజూరాబాద్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఉన్న ఎస్సారెస్పీ కాలువ పై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వాహనాల రద్దీ పెరిగిపోవడంతో వంతె నలు ఇరు కుగా మారడంతో రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

● వంతెనలకు ఇరువైపులా దెబ్బతిన్న సైడ్ వాల్స్

మండలంలోని కొత్తపల్లి, తుమ్మనపల్లి, ఇప్పలనర్సింగాపూర్, సైదాపూర్ రోడ్డు, కేసీ క్యాంపు వద్ద, పెద్దపాపయ్యపల్లి గ్రామాల మీదుగా ఎస్సారెస్పీ కాలువపై చాలా ఏళ్ల క్రితం వంతెనలు నిర్మించారు. వాటికి ఇరువైపులా సైడ్‌వాల్స్ దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం ఎస్సారెస్పీ కాలువలో నీళ్లు నిండుగా పారుతుండగా, సైడ్‌వాల్స్ దెబ్బతిని ఉండటంతో ఎదురుగా భారీ వాహనాలు వస్తున్న సమయంలో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● కానరాని సూచికలు :

ఎస్సారెస్పీ కాలువపై నిర్మించిన వంతెనల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కరీంనగర్- వరంగల్ ప్రధాన రహదారిపై మూడు చోట్ల ఉన్న వంతెనలు పూర్తిగా ఇరుకు గా మారాయి. ఈ దారి గుండా ప్రతిరోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెనల సమీపంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే భారీ వాహనదారులు నెమ్మదిగా వచ్చే అవకాశం ఉంటుంది. అధికారులు స్పందించి దెబ్బతిన్న వంతెన సైడ్‌వాల్స్‌కు మరమ్మతులు చేయించి, వంతెనల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రయాణం ప్రమాదకరంగా మారింది

\- భాషవేని రాజేష్‌యాదవ్, వాహనదారుడు, సింగాపూర్



తుమ్మనపల్లి గ్రామంలోని ఎస్సారెస్పీ కాలువపై ఉన్న బ్రిడ్జి పూర్తిగా ఇరుకుగా మారింది. దీనికి తోడు బైపాస్ రోడ్డు పనులు జరుగుతుండటంతో సామర్థ్యానికి మించి లోడుతో లారీలు తిరుగుతున్నాయి. ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. రాత్రి వేళలో ఈ బ్రిడ్జి సమీపంలో వీధి దీపాలు సైతం లేకపోవడం, బ్రిడ్జి సైడ్‌వాల్స్ దెబ్బతిని ఉండటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

గ్రామీణ క్రీడకు అంతర్జాతీయ ఖ్యాతి

- ఖోఖోలో విశ్వ విజేతలుగా భారత జట్లు
- మహిళల జట్టుకు కోచ్‌గా జిల్లా వాసి



భారత జట్టుకు సూచనలు ఇస్తున్న నరేష్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 20: గ్రామీణ క్రీడ ఖో-ఖోకు అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. పల్లెల్లో, పాఠశాలల్లో చిన్నారులు, విద్యార్థులు ఆడుకునే ఖో-ఖో ఆటలో మహిళలు, పురుషుల విభాగాలలో మన జట్లు విశ్వవిజేతలుగా నిలిచాయి. ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఖో-ఖో ఫెడరేషన్ ఆఫ్



ప్రపంచ కప్‌ను ముద్దాడుతున్న కోచ్ నరేష్

ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచకప్ పోటీల్లో 23 దేశాలు పాల్గొన్నాయి. ఆదివారం రాత్రి నిర్వహించిన మహిళల ఫైనల్స్ మ్యాచ్‌లో భారత జట్లు నేపాల్ జట్లతో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో భారత జట్టు 78-40 పాయింట్ల తేడాతో నేపాల్‌ను చిత్తుచేసి తొలి ప్రపంచకప్‌ను తన ఖాతాలో వేసుకుంది. పురుషుల విభాగంలో భారత జట్టు నేపాల్‌పై 54-36 పాయింట్ల తేడాతో గెలుపొంది ప్రపంచకప్‌ను ముద్దాడింది. ప్రపంచ చాంపియన్‌గా భారత్‌ను నిలపడంలో ఉమ్మడి కరీంనర్ జిల్లా ధర్మారం బంజరుపల్లి తండావాసి ఇస్లావత్ నరేష్ ముఖ్య భూమిక పోషించారు. నరేష్ భారత మహిళల జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. 30 రోజులపాటు శిక్షణను అందించి భారత్‌ను ప్రపంచ చాంపియన్‌గా నిలిపాడు.

- ఖో-ఖో మహిళల జట్టు కోచ్ ఇస్లావత్ నరేష్ నేపథ్యం

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): ఖో-ఖోలో భారత మహిళల జట్టు ప్రపంచ కప్ గెలవడంలో ధర్మారం మండలం లంబాడితండా (బి)కు చెందిన ఇస్లావత్ నరేష్ కీలక పాత్ర పోషించారు. ఖో-ఖోలో అద్భుత ప్రతిభ చూపి భారత్ మహిళల జట్టు కోచ్‌గా నియమి తులయ్యారు. ఆయన శిక్షణలో రాటుదేలిన జట్టు ప్రపంచ చాంపిన్‌గా నిలిచింది.

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం లంబాడితండా (బి) గ్రామానికి చెందిన ఇస్లావత్ రూపానాయక్-సాంతారీల కుమారుడు ఇస్లావత్ నరేష్. వీరిది ఓ సాధారణ వ్యవసాయ కుటుంబం. నరేష్‌కు చిన్ననాటి నుంచి ఆటలంటే మక్కువ. హుస్నాబాద్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకున్న ఆయన ఖో-ఖోలో పలు పథకాలు సాధించారు. 2006లో రైల్వే శాఖలో సౌత్ సెంట్రల్ నాందేడ్ డివిజన్‌లో ఉద్యోగం సాధించారు. ఆయన ప్రతిభను గుర్తించిన రైల్వే శాఖ తమ జట్టుకు 2016లో కోచ్‌గా నియమించింది. ఆయన శిక్షణ తీరును గమినించి స్పోర్ట్స్ ఫెడరేషన్ నరేష్‌ను ప్రపంచ కప్‌లో భారత మహిళా జట్టుకు కోచ్‌గా నియమించింది. ఆయన శిక్షణలో రాటు దేలిన క్రీడాకారులు ప్రపంచ చాంపియన్లుగా నిలిచారు.

ఖో-ఖోతో ఉజ్వల భవిష్యత్తు



- ఇస్లావత్ నరేష్, భారత మహిళల జట్టు కోచ్

ఖో-ఖో క్రీడతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఈ క్రీడతో పలు సంస్థలు ఉద్యోగావ కాశాలు కల్పిస్తున్నాయి. ప్రపంచ చాంపియన్లుగా నా శిక్షణలో భారత జట్టు నిలిచింది. 2027లో ఇంగ్లాండ్‌లో ప్రపంచ కప్ వరకఉ చీఫ్ కోచ్‌గా ఎదగాలనుకుంటున్నాను.

ఖో-ఖోకు ఒలింపిక్స్‌లో స్థానం కల్పించాలి..



- వై మహేందర్‌రావు, ఖో-ఖో సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి

ఖో-ఖో క్రీడకు ఒలంపిక్స్‌లో స్థానం కల్పించాలి. రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్లు పది సంవత్సరాలుగా విశేష ప్రతిభ చాటుతున్నాయి. భారత ఖో-ఖో జట్టు కోచ్‌గా మన జిల్లాకు ఎందిన నరేష్ వ్యవహరించడం మనందరికీ గర్వకారణం.

జాతీయ జట్టులో స్థానం సాధిస్తా..



- నవీన్‌రాజ్, సీనియర్ జాతీయ క్రీడాకారుడు

తొలి ప్రపంచకప్ ఖో-ఖో పోటీల్లో భారత్ మహిళల, పురుషుల విభాగాల్లో చాంపియన్‌గా నిలవడం ఆనందంగా ఉంది. వచ్చే ప్రపంచకప్ పోటీల్లో స్థానం సాధించేందుకు నేను ఇప్పటి నుంచి తీవ్రంగా కృషి చేస్తాను. ఖో-ఖో అంతర్జాతీయ స్థాయికి చేరవడం ఆనందంగా ఉంది.

భారత జట్లకు అభినందనలు....



- గజ్జల భవాని, జాతీయ క్రీడాకారిణి

ప్రపంచ ఖో-ఖో పోటీల్లో భారత జట్లు చాంపియన్లుగా నిలవడం ఆనందంగా ఉంది. మహిళలు, పురుషుల జట్లకు అభినందనలు. గతంలో ఖో-ఖో జాతీయ క్రీడగా మాత్రమే ఉండేది. ఇప్పుడు 23 దేశాలు ప్రపంచకప్ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది.

ఆర్టీసీకి సంక్రాంతి జోష్

- కరీంనగర్ రీజియన్ పరిధిలో రూ.24.71 కోట్ల ఆదాయం



భగత్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు కరీంనగర్ రీజియన్ పరిధిలో 24.71 కోట్ల రూపాయల ఆదాయం లభించింది. పండగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపింది. రీజియన్ వ్యాప్తంగా 11 డిపోల పరిధిలో ఈ నెల 7వ తేదీ నుంచి 19 వరకు (13, 14తేదీలు మినహాయించి) ఆయా రూట్లలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర వేసింది. ఇందులో జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు, తిరుగు ప్రయాణంలో కరీంనగర్ నుంచి జేబీఎస్ వరకు ఎక్కువ బస్సు సర్వీసులు నడిపారు.

డిపోల వారీగా ఆదాయ వివరాలు

డిపో	ఆదాయం (కోట్లలో)	కిలోమీటర్ల (లక్షల్లో)	ఈపీకే	ఓఆర్	ప్రయాణికులు (లక్షల్లో)
గోదావరిఖని	3.69	6.01	61.43	98	7.53
హుస్నాబాద్	1.37	2.46	55.69	98	3.60
హుజూరాబాద్	1.75	2.88	60.80	107	4.12
కరీంనగర్-1	2.70	5.21	51.83	78	5.48
కరీంనగర్-2		3.16	6.36	49.72	80 4.38
మంథని	1.49	2.59	57.45	92	2.54
జగిత్యాల	3.18	5.58	57.08	89	6.33
కోరుట్ల	1.90	2.99	63.38	100	3.74
మెట్‌పల్లి	1.79	2.86	62.74	101	3.86
సిరిసిల్ల	1.84	3.04	60.50	100	3.83
వేములవాడ	1.83	3.23	56.61	94	3.59
రీజియన్	24.71	43.21	57.18	92	48.99

సిబ్బంది సహకారంతో..

- బి.రాజు, ఆర్టీసీ ఆర్ఎం



సంక్రాంతి పండగ సందర్భంగా ఆయా రూట్లలో రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాం. సిబ్బంది సహకారంతోనే ఇంత ఆదాయం పొందగలిగాం. రద్దీకి అనుగుణంగా తగినన్ని బస్సులను ఏర్పాటు చేసిన అధికారులతో పాటు సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లకు ఆర్టీసీని ఆదరించిన ప్రయాణికులకు ధన్యవాదాలు. సంస్థపై ఇదే ఆదరణను కొనసాగించాలని కోరుతున్నాం.

రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌గా కరీంనగర్

- ద్వితీయ స్థానంలో వరంగల్
- మహబూబ్‌నగర్‌కు తృతీయ స్థానం

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి 46వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో మూడు రోజులుగా కొనసాగుతున్న పోటీలు సోమవారం



చాంపియన్స్ ట్రోఫీ అందుకుంటున్న కరీంనగర్ జిల్లా జట్టు

ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు వరంగల్‌పై 18-16 గోల్స్ తేడాతో విజయం సాధించింది. మహబూబ్‌నగర్ జట్టు తృతీయ, ఆదిలాబాద్ నాలుగో స్థానంలో నిలిచాయి. కరీంనగర్ జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలతో మానసి కోల్లాసం లభిస్తుందన్నారు. డీఆర్‌వో పవన్ కుమార్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి నెమలికొండ ప్రభాకర్, రెప్రిస్ బోర్డు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, వివిధ జిల్లాల కార్యదర్శులు శంకర్, ఎడ్ల ప్రవీణ్ కుమార్, సిరికొండ శ్రీనివాస్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, హనుమంతు, రమే ష్, వీర్‌పాల్, దిలీప్ పాల్గొన్నారు.

17వ బెటాలియన్ కానిస్టేబుల్స్‌కు స్విమ్మింగ్ శిక్షణ



శిక్షణ పొందుతున్న కానిస్టేబుల్స్

ముస్తాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఓ స్విమ్మింగ్ పూల్‌లో సోమవారం రోజున 17వ బెటాలియన్ కమాండెంట్ గంగారాం ఆధ్వర్యంలో బెటాలియన్ కానిస్టేబుల్స్‌కు ఈత పోటీలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు (ఎస్‌డిఆర్ఎఫ్) రాష్ట్రంలో విపత్తు నివారణ చర్యల్లో భాగంగా నిర్వహించే సహాయక కార్యక్రమాల్లో పాల్గొనే బెటాలియన్ పోలీసులకు ఈతలో ప్రావీణ్యం కలిగి ఉండాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంభవించే విపత్తు నివారణ చర్యలలో వీరంతా పాల్గొనడానికి ముందస్తుగా శిక్షణ ఇప్పించామని బెటాలియన్ కమాండెంట్ గంగారాం తెలిపా రు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, రమేష్, ఎస్ఐ నరేష్, సంతోష్, శ్రీధర్, 150 మంది బెటాలియన్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

'వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు'ను విజయవంతం చేయాలి

- బీసీ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరువు అంజన్న



సమావేశంలో దరువు వేస్తున్న అంజన్న

జగిత్యాల అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న ఏర్పాటు చేసిన వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరువు అంజన్న అన్నారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధం చేయాలని చెప్పినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఎస్సీ వర్గీకరణపై ముఖ్యమంత్రి నాలుగు నెలల క్రితం ప్రకటించి తప్పడంతో మరో ఉద్యమం చేయక తప్పడం లేదని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బాలె శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీనారాయణ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, భోనగిరి కిషన్, రాచకొండ రోజా, నక్క సతీష్, కొల్లూరి సురేందర్, రావర్తి రవి, బండ పల్లి మల్లీశ్వరి, భోనగిరి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను రద్దు చేయాలి

- రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ఆందోళన



పోస్టుకార్డును ప్రదర్శిస్తున్న రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు

కోరుట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని సోమవారం కోరుట్ల పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట తెలంగాణ పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు నిరసన తెలిపి పోస్టు కార్డు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ మాట్లాడారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులకు పోస్టు కార్డులను పంపించారు. ఆర్డీఓ జీవాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం ద్విచక్ర వాహన ర్యాలీని తపాల కార్యాలయం వరకు నిర్వహించి పోస్టు కార్డును పోస్టు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు హన్మంత రెడ్డి, బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాష్‌రావు, పబ్బా శివానందం, గంటేడి రాజ్‌మోహన్, యాకుబ్, నల్లాల లక్ష్మినారాయణ, ఎండి సైపోద్దిన్, రాజయ్య, చిలుక గంగారాం, స్వామి, రాజేశ్వర్, లక్ష్మీకాంతం, మల్లయ్య, గోపాల్, శ్రీరాములు, సాబితలీ, నారాయణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7350 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 30మంది రైతులు 311క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు ఎనిమిది క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7350, కనిష్ఠ ధర రూ.6300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు సుల్తానాబాద్ కు చెందిన ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఎం సంప్రీత్ ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియలు తెలిపారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలలో సంప్రీత్ ప్రతిభను చూపడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారన్నారు. ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్ లో జరుగునున్న రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలలో పాల్గొననున్నారు. సంప్రీత్‌ను అభినందించారు.



రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ చైర్మన్

- ఓపెన్ చదరంగ పోటీల్లో విశాల్ ప్రతిభ

ఎలిగేడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాలో ఈనెల 19న జరిగిన ఇండియా ఓపెన్ చదరంగం పోటీల్లో ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన తాటిపెల్లి విశాల్ ప్రతిభకనబరిచాడు. ఓపెన్ విభాగంలో 7రౌండ్లకు గాను 5రౌండ్లు గెలిచాడు. విశాల్‌కు ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణరావు చేతులమీదుగా నగదు బహుమతి ప్రశంసాపత్రం ట్రోఫీ అందజేశారు ఆర్గనైజర్ నందకిషోర్, వెంకటగిరి, సీనియర్ కోచ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రం... రాజన్న క్షేత్రం



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు

- ఆలయానికి పోటెత్తిన భక్తులు
- దర్శనానికి నాలుగు గంటల సమయం

వేములవాడ కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. కొమరవెల్లి మల్లన్న వారంపట్నంను పురస్కరించుకుని వేములవాడ రాజన్నకు భక్తులు మొక్కులు చెల్లించుకోవడం ఆనవా యితీ. ముందుగా కల్యాణకట్టలతో తలనీలాలు సమర్పిం చుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునే భక్తులు క్యూలైన్‌లో



రాజన్న ఆలయ ఆవరణలో తనిఖీలు చేస్తున్న భద్రత సిబ్బంది

నాలుగు గంటలపాటు నిరీక్షించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌లో భక్తులతో కిక్కిరిసిపోయాయి. అమ్మ వారికి ఓడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించు కున్నారు.

- బాంబ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు..

రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి సోమవారం భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో జిల్లా బాంబ్, డాగ్ స్క్వాడ్ టీం సభ్యులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఆలయ పరిసరాలతో పాటు పార్కింగ్ స్థలాలు, వసతిగదులతో పాటు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.

- స్మార్ట్ టీవీల ఏర్పాటు..

రాజన్న ఆలయంలో నిర్వహించే పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయానికి వచ్చే భక్తులు వీక్షించేందుకు వీలుగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పలు ప్రాంతాల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. రాజన్న ఆలయ లడ్డుల కౌంటర్, కోడెమొక్కు క్యూలైన్‌లతో పాటుగా పలు ఓపెన్ స్థలాల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయగా రాజన్న ఆలయంలో భక్తులు ఎక్కువగా ఉండే స్థలాల్లో భక్తులు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు భారీ ఫ్యాన్‌లను ఏర్పాటు చేశారు.

వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు



హరికథను చెబుతున్న భాగవతరాణి నాగరాణి

- ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వేములవాడ కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం త్యాగరాజ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతి, నాగరాణి, శ్రీరాంభట్టర్ వేర్వేరుగా తమ హరికథతో భక్తులను ఆకట్టుకున్నారు. సాయంత్రం వైలెన్ సోలో కచేరి వినయకృష్ణ చేపట్టగా నరహరి, సతీష్ ఆధ్వర్యంలో సంగీత కచేరిని నిర్వహించారు. రతన్‌కుమార్ బృందం చేసిన నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- త్యాగరాజస్వామి వారి కీర్తనలు చరిత్రలో నిలిచిపోతాయి..

త్యాగరాజస్వామి వారి కీర్తనలు చరిత్రలో నిలిచిపోతాయని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న ఆరాధనోత్సవాలను సోమవారం ప్రారంభించి కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 72 సంవత్సరాలుగా వేములవాడ రాజన్న ఆలయంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు చేపట్టడం గొప్ప విషయమని అన్నారు.



శాస్త్రీయ నృత్యం చేస్తున్న రతన్ కుమార్ బృందం

న్యూస్ బాక్స్

పంచాయతీ కార్యదర్శులను నియమించాలి

ఇల్లంతకుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొంటు బీజేపీ నాయకులు సోమవారం ఎంపీడీవో శశికళకు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా మానకొండూర్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ బత్తిని స్వామిగౌడ్ మాట్లాడుతూ మండలంలోని కిష్టరావుపల్లె, వంతడుపుల, నర్సక్కపేట తదితర గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు లేకపోవడంతో ఇన్‌చార్జీల పాలనలో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు పంచాయతీ కార్యదర్శితో అవసరం ఏర్పడినప్పుడు ఇబ్బందిగా మారిందన్నారు. ఉన్నతస్థాయి అధికారులు స్పందించి పూర్తిస్థాయి పంచాయతీ కార్యదర్శులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తిప్పారపు శ్రావణ్, ఉపాధ్యక్షుడు చిమ్మనగొట్టు శ్రీనివాస్, శక్తికేంద్ర ఇన్‌చార్జి రొండ్ల మధుసూదన్ రెడ్డి, తాళ్ళపెల్లి కిషన్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడి పరామర్శ

గంభీరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ తండ్రి జనార్దన్ ఆదివారం మృతి చెందగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పరామర్శించారు. మండల కేంద్రంలోని దేవసాని కృష్ణ నివాసానికి వెళ్లి ప్రతాప రామకృష్ణ పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట పార్టీ జిల్లా నాయకులు అన్నల్‌దాసు వేణు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్‌యాదవ్, మండల ఉపాధ్యక్షుడు మద్దుల రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామ సభలను విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన గ్రామ సభలను ప్రజలు విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేసేందుకు ప్రభుత్వం గ్రామసభలను నిర్వహించి దరఖాస్తులను స్వీకరిస్తోందని అన్నారు. అర్హులను గుర్తించి సంక్షేమ ఫలాలను అందించనుందని పేర్కొన్నారు. ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని నర్సయ్య కోరారు.

ఇల్లంతకుంట: మండలంలోని గ్రామ పంచాయితీ కార్యాలయాలలో మంగళవారం నుంచి ప్రజాపాలన గ్రామసభలు జరుగుతాయని ప్రత్యేకాధికారి రామకృష్ణ పేర్కొన్నారు. 21న అనంతగిరి, ఇల్లంతకుంట, జంగమరెడ్డిపల్లె, ఒబులాపురం, గూడెపుపల్లి, ఆరెపల్లి, గాలిపెల్లి, అనంతారం, జవారిపేట, 22న పెద్దలింగాపూర్, దాచారం, గొల్లపల్లి, ముస్కానిపేట, రహీంఖాన్‌పేట, కందికట్కూర్, రేపాక, వెల్జీపూర్, 23న సిరికొండ, తిప్పాపూర్, వల్లంపట్ల, సోమారంపేట, నర్సక్కపేట, పొత్తూరు, వంతడుపుల, కేసన్నపల్లె, 24న తాళ్ళపల్లి, తెనుగువాణిపల్లె, వెంకట్రావుపల్లె, రామోజిపేట, చిక్కుడువాణిపల్లె, పత్తికుంటపల్లె, రంగాపేట, కిష్టరావుపల్లె గ్రామాల్లో సభలు జరుగుతాయని ప్రత్యేకాధికారి పేర్కొన్నారు.

'సంక్షేమం' అందరికీ అందేనా?

విమర్శలకు దారితీసింది. దీంతో మళ్లీ దరఖాస్తులు తీసుకొని కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

● ఆత్మీయ భరోసాకు 11,485 మంది

జిల్లాలో అత్మీయ భరోసాకు అర్హుల ఎంపిక ఉపాధి హామీ జాబ్ కార్డులతో పరిశీలనకు మార్గదర్శకాలు వచ్చాయి. భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ అత్మీయ భరోసా పథకంలో రెండు విడతలుగా రూ. 12 వేలు అందించనున్నారు. ఇందుకోసం 2023-24 ఏడాదిలో 20 రోజుల పాటు ఉపాధి హామీ పనులకు వెళ్లిన వారిలో వ్యవసాయ భూమిలేని ఉపాధి కూలీలను అర్హులుగా జాబితాలను సిద్ధం చేశారు. జిల్లాలో 98,115 జాబ్‌కార్డులు ఉండగా దాదాపు 33 వేల మంది భూమిలేని నిరుపేదలు ఉన్నారు. ఇందులో 20 రోజుల పాటు పనిచేసిన కూలీలు 11,485 మందిని అర్హులుగా గుర్తించారు. గ్రామసభల్లో జాబితాలను వెల్లడించనున్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించడానికి యాసంగి నుంచి రైతుభరోసాను అందించనున్నారు. రెండు సీజన్లకు కలిపి రూ 12 వేలు ఇవ్వనున్నారు. రాళ్ల, రప్పలు, రియల్ వెంచర్లు, గుట్టలు, నాలా


సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కన్వర్షన్ భూములకు భరోసాను అందించకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. వ్యవసాయ గణన ప్రకారం 171 రెవెన్యూ గ్రామాల్లో 132574 మంది రైతుల వద్ద 1,09,983 హెక్టార్ల భూమి ఉన్నట్లు గుర్తించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 12 విడతలుగా 1,29,407 మంది రైతులకు రూ 260.20 కోట్లు చెల్లించారు. ఈసారి ఏమేరకు రైతు భరోసా అందిస్తారనే ఆసక్తి నెలకొంది.

● ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన

ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన క్షేత్రస్థాయిలో కొనసాగింది. జిల్లాలో 98.20 శాతం పూర్తి చేశారు. జిల్లాలో ప్రజాపాలనలో 1,07,398 దరఖాస్తులు రాగా 1,05,466 దరఖాస్తులు పరిశీలించారు. సర్వే పూర్తి కాగా దరఖాస్తు దారులు అందుబాటులో లేనివి మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించే గ్రామసభలో ఎవరైనా అర్హులు ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారు.

● ఆందోళన వద్దు..

ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియలో అర్హులుగా ఉండి అవకాశం కోల్పోతున్న వారు ఆందోళన చెందవద్దని అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందించడానికి నిరంతర ప్రక్రియగా ఉంటుందని మంత్రులు స్పష్టం చేశారు. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చునని ప్రచారం చేస్తున్నారు. కొత్తగా గ్రామసభల్లో వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలించనున్నారు. దీంతో గ్రామసభల్లో మళ్లీ దరఖాస్తులు వెల్లువకానున్నాయి.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన


కోనరావుపేట, దమ్మన్నపేటలో నల్ల బాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో సోమవారం నల్ల బాడ్జీలతో నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ హెచ్‌ఎం రాములుపై దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తు, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోయన్నగారి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: తుక్కుగూడ హెచ్‌ఎం రాములుపై దాడిచేసిన దుండగులను పట్టుకొని శిక్షించాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ కోరారు. కోనరావుపేటలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కన్నా ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు వేముల జ్ఞానేందర్, సంతోష్, సబిత, వనిత, స్వాతి, రాజమణి, రేణుక, ప్రవళిక తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

ఎల్లారెడ్డిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా సాగు చేసుకుని జీవిస్తున్న తమ భూములను కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలోని ఓ సామాజిక వర్గం సభ్యులు సోమవారం మండల కేంద్రంలో ఆందోళనకు దిగారు. స్థానిక పాత బస్టాండు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా తరలివచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నినాదాలు చేశారు.

కొందరు వ్యక్తులు తమ భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సామాజిక వర్గానికి చెందిన సుమారు 100 మంది పాల్గొన్నారు.

విద్యార్థి దశలో కష్టపడితేనే మంచి భవిష్యత్తు

- ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

కోనరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో కష్టపడినప్పుడే మంచి భవిష్యత్తు లభిస్తుందని ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పలు అంశాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోక్సో చట్టం, గంజాయి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో మాట్లాడి వారివారి పాత్రలను, నిర్వహించాల్సిన విధులను తెలిపి, వారి అభిప్రాయాలను కూడా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సైలు ప్రశాంత్ రెడ్డి, రాహుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో ఏఎస్పీని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని నారాయణ స్కూల్‌లో సోమవారం పోలీస్ అక్క ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళల రక్షణే లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: పోలీస్ అక్క, ఖాకీ కిడ్స్ ప్రోగ్రాంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు తంగళ్లపల్లి ఎస్ఐ రాంమోహన్ సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీస్ అక్క ప్రోగ్రాంలో భాగంగా తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ మహిళా పోలీస్ కానిస్టేబుల్ సుజాత ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మహిళలకు సంబంధించిన నేరాలు, బయటకు చెప్పుకోలేని విషయాలు ఉంటే 8712656425 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారు వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అలాగే ఖాకీ కిడ్స్ ప్రోగ్రాంలో భాగంగా సైబర్ క్రైమ్, ట్రాఫిక్ రూల్స్ గూర్చి పిల్లలకు అవగాహన కల్పించారు. ఖాకీ కిడ్స్ ప్రోగ్రాం ఇన్‌చార్జి కానిస్టేబుల్ అరవింద్ ఫోన్ నంబర్ 9346721419కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

వేములవాడ: తమ చుట్టుపక్కల జరిగే నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ బి లత విద్యార్థులకు సూచించారు. పోలీస్ అక్క కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు వేములవాడ పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆమె అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ బి లత మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై జరిగే దాడులు, అసభ్యకరమైన ప్రవర్తన లాంటివి ఎక్కడైనా జరిగితే నేరుగా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వివరాలను గోప్యంగా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామ ని తెలిపారు. పరిసరాల్లో జరుగుతున్న సంఘటనల సమాచారం అందిస్తే తమ వంతు సహాయం చేస్తామన్నారు. రహదారి భద్రత, నేరాలపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండి రక్షించుకోవాలని ఆమె సూచించారు.

మత్తుపదార్థాల నిర్మూలనలో విద్యార్థులు భాగస్వాములు కావాలి: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ

సిరిసిల్ల క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మతుపదార్థాల నిర్మూలనలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణం పద్మనాయక మండపంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై, గంజాయి లాంటి మత్తు పదార్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో అధికారులతో కలసి పోస్టర్స్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాధకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో యాంటీ డ్రగ్ క్లబ్ ఏర్పాటు చేసి పాఠశాలలు, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గంజాయికి సంబంధించిన సమాచారం కోసం తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో నెంబర్ 8712671111, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ 8712656392 నంబర్లుకు ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. విద్యార్థులు ఎలాంటి పరిస్థితుల్లోనైనా తాము ఎంచుకున్న లక్ష్యం కోసం ఆత్మవిశ్వాసంతో క్రమశిక్షణతో, ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ప్రతీవిద్యార్థి ఒత్తిడిని అధిగమించడానికి యోగా, మెడిటేషన్, బుక్స్ చదవడం లాంటివి అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ ఉపేందర్, సీఐ కృష్ణ, సిబ్బంది, పాఠశాలల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ బడులు బలోపేతం


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో కృష్ణహరి, తదితరులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ బడులు బలోపేతం అవుతాయని ఎంఈవో కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను స్థానిక నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో కృష్ణహరి మాట్లాడుతూ కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది ఉత్తమ విద్యను అందిస్తున్నామని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించి వారి ఉన్నతికి పాటు పడాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంపత్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బాలరాజు, ఉపాధ్యాయులు నరేశ్, రజిత, ప్రశాంత్‌కుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంపై నిర్లక్ష్యం వీడాలి

వేములవాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానంపై రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన వేములవాడలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతినిత్యం వేలాదిమంది భక్తులు సందర్శించే రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సిబ్బంది కొరతతో భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా వేములవాడ రాజన్న ఆలయానికి యాదగిరిగుట్ట నుంచి బదిలీ వచ్చిన ఏఈవో రమేష్ బాబు, పర్యవేక్షకులు శ్రీలత, రాజన్‌బాబు వివిధ కారణాలతో యాదగిరిగుట్ట ఆలయానికి డిప్యూటేషన్‌పై తిరిగి వెళ్లిపోయారన్నారు. వారి స్థానంలో వేములవాడ ఆలయానికి ఎవరిని కేటాయించకపోవడంతో ఉద్యోగుల కొరత కారణంగా ఆలయ నిర్వహణ గాడి తప్పిందని అన్నారు. సిబ్బందికొరత, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా రాజన్న ఆలయంలో భక్తులకు తగిన ఏర్పాట్లు కల్పించడం లేదని వాపోయారు. క్యూలైన్ల నిర్వహణ సైతం ఇష్టారాజ్యంగా మారిపోయిందని అన్నారు. మహాశివరాత్రి పర్వదినం సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు వేములవాడ ఆలయంపై దృష్టి సారించి తగినంత సిబ్బందిని కేటాయించాలని, భక్తులు ఇబ్బందులు పడకుండా చూడాలని ఏనుగు మనోహర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీని బహిష్కరించిన బాల్కొండ ఎమ్మెల్యే

రుద్రంగి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు లేఖ రాసినట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దెగావత్ తిరుపతి తెలిపారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకంలో రూ. లక్ష చెక్కుతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. దీనికి నిరసనగా రుద్రంగి మండలం మానాల, గిరిజన తండాలలో పంపిణీ చేసే కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీని బహిష్కరిస్తున్నాని తెలిపారు.

అన్నదాతల అభ్యున్నతే సహకార సంఘం లక్ష్యం

- పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి


చెక్కులను అందజేస్తున్న ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల అభ్యున్నతే లక్ష్యంగా సహకార సంఘం పని చేస్తోందని ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని నారాయణపూర్, బొప్పాపూర్, సింగారం గ్రామాల్లోని ఐదుగురు రైతులకు మంజూరైన రూ. 22 లక్షల రుణాల చెక్కులను స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి పరిచేందుకు రైతులకు దీర్ఘకాలిక రుణాలను అందిస్తున్నామని అన్నారు. అన్నదాతలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సత్తయ్య, డైరెక్టర్లు, నాయకులు ఎల్లయ్య, వెంకటనర్సింహారెడ్డి, చంద్రారెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వాచ్‌ఉమెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మహిళ డే వాచ్ ఉమెన్‌గా పనిచేసేందుకు ఆసక్తిగల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని విద్యాధికారి మురళి నాయక్ సోమవారం ఒక్క ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల మహిళలు ఈ నెల 24వ తేదీ లోపు మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రాజన్న భక్తుల వద్ద హోంగార్డు చేతివాటం

వేములవాడ కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో హోంగార్డు భక్తుల వద్ద చేతివాటం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. రాజన్న దర్శనం కోసం వచ్చిన భక్తుల వద్ద డబ్బులు తీసుకుని దర్శనం చేస్తున్నట్లు ఆలయాధికారులు గుర్తించారు. దీంతో సదరు హోంగార్డును మందలించి గుట్టుచప్పుడు కాకుండా ఇతర ప్రాంతానికి బదిలీ చేసినట్లు సమాచారం.

భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సిరిసిల్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల లేబర్ అడ్డాపై పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సోమవారం బిల్డింగ్ మరియు ఇతర కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు తరలివచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి మాట్లాడుతూ స్థానిక కార్మికులకు ఉపాధి దొరికే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, యూనియన్ అధ్యక్షుడు సిరిగిరి శ్రీనివాస్, కోల శ్రీనివాస్, సందుపట్ల పోచమల్లు, నవీన్, రమేష్, లక్ష్మి పాల్గొన్నారు.

యారన్ సబ్సిడీ కోసం నేత కార్మికుల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నేత కార్మికులు

సిరిసిల్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పవర్‌లూం నేత కార్మికులకు బతుకమ్మ చీరలకు సంబంధించిన యారన్ సబ్సిడీని వెంటనే అందించాలని కార్మికులు ధర్నా నిర్వహించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట జిల్లా పవర్‌లూం వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి చేనేత జౌళి శాఖ డీడీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కోడం రమణ, ప్రధాన కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం టెస్కో ద్వారా ఉత్పత్తి చేయించే స్వశక్తి సంఘాల చీరల వస్త్రానికి సంబంధించి కార్మికులకు యారన్ సబ్సిడీ అందించాలని కోరారు. కార్యక్రమంలో దేవదాస్, రమేష్, కనకయ్య, సత్యం, శంకర్ పాల్గొన్నారు.

'మతితప్పి మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు'

తంగళ్లపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు మతితప్పి మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మాట్ల మధు విమర్శించారు. సోమవారం తంగళ్ళపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశాయిపల్లె గ్రామ శివారులో బీఆర్ఎస్ నేతలు భూకబ్జాకు పాల్పడ్డారని అనడం అవాస్తవం అన్నారు. 1982లో కాంగ్రెస్, టీడీపీ హయంలో ఇచ్చినా పట్టాలకు బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముడిపెట్టి కాంగ్రెస్ నాయకులు మాట్లాడం సిగ్గుచేటు అన్నారు. 1982లో జరిగిన పట్టాల పంపిణీకి కేటీఆర్‌కు ఏం సంబంధం అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కొయ్యడ రమేష్, సిలివెరి చిరంజీవి, అవధూత మహేందర్, కుర్మా రాజయ్య, గుండు ప్రేమ్ కుమార్, ఎన్నమనేని అమర్ రావ్, నవీన్ రెడ్డి, నరేష్, రమేష్, భగవాన్, జీవన్, సయ్యద్ అఫ్రోజ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌కు గౌతమి కవి శ్రేష్ఠ పురస్కారం

గంభీరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగన్నపేటకు చెందిన కవి ప్రభాకర్ గౌతమి కవి శ్రేష్ఠ పురస్కారానికి ఎంపికయ్యాడు. ఆర్యణి సకల వేధిక శ్రీగౌతమేస్వర సాహితి కళా సేవ సంస్థ కరీంనగర్ ఫిలిం భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ స్థాయి సంక్రాంతి పురస్కారాన్ని సోమవారం అందించారు. ఇందులో భాగంగా లింగన్నపేటకు చెందిన కవి తంగళపల్లి ప్రభాకర్ సాహితి కృషిని గుర్తించి, జాతీయ స్థాయి గౌతమి కవి శ్రేష్ఠ పురస్కారం ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రబాకర్ మాట్లాడుతూ పురస్కారాలు మన బాధ్యతను మరింత పెంచుతాయని తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


ఇల్లంతకుంట, సిరిసిల్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీస్ సిబ్బంది

సిరిసిల్ల క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని టౌన్ సీఐ కృష్ణ సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం సిరిసిల్ల పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ కృష్ణ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, సిరిసిల్లలో ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఆయన అన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చని ఎస్ఐ రమాకాంత్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో కలిసి ఆయన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి పాత, కొత్త బస్టాండు వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ భద్రత వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి విద్యార్థుల చేత అంబేడ్కర్ చౌరస్తా ఆవరణలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: రోడ్డుభద్రతా నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి సూచించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్, హెడ్‌కానిస్టేబుల్ దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుద్రంగి: ప్రతీఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటిం చాలని ఎస్సై సిరిసిల్ల అశోక్ ఉన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట): వీర్నపల్లి మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి సోమవారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఎస్ఐ ఎల్లాగౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.